# ధృవతార రాలిపోయింది

—వి. రామారావు

ఊసరవెల్లికి రాజకీయ వ్యాపారము అచ్చొచ్చింది. ఆయన పేరేమిటో పూర్తిగా ఎవరికీ తెలియదు. తెలిసిన వాళ్ళందరూ ఊసరవెల్లి అని అంటారు. మహాభక్తులు యు.వి (U.V) అని ముద్దుగా పిలుస్తారు. ఘనంగా డెబ్బయి అయిదు సంవత్సరాలు బ్రతికాడు. దేశంలో ఎన్నో పెద్ద పదవులు అధిష్ఠించాడు. చివరకు సన్మాన సభలో 'జై' అంటూ గుండె జబ్బుతో 'టా' అన్నాడు.

ఊసరవెల్లి భౌతిక కాయాన్ని ఖద్దరు తానులో చుట్టారు. అన్ని పార్టీల జండాలు పరచి పూలమాలలు, పసుపు కుంకుమలు పైన వెదజల్లారు లారీ పైమేడకట్టి దాని లోనిక భౌతిక కాయాన్ని అత్తరు, పన్నీరులతో జేర్చారు. లారీచుట్టూ అన్ని పార్టీల నాయకులతో శ్రీవారు తీయించుకున్న ఫొటోలు వ్రేలాడ దీశారు. లారీ పైన భక్తులు భజనలతో చుట్టుముట్టారు. లారీ పురవీధులగుండా పుష్ప వర్షములో స్వర్గపురికి పయనిస్తోంది.

లారీ వెనుక వివిధ పార్టీల కార్యకర్తలు, పెద్దమనుష్యులు, పట్టణ గుండాలు, సంపన్నులు, బలహీనవర్గాలవారు, వెనుకబడిన తరగతుల వారు, కార్మికులు, వారి నాయకులు కాలినడక ప్రారంభించారు. ముందు బ్యాండు మేళగాళ్ళు యూనిఫారమ్ ధరించి సినిమా సాహిత్యం ఆలాపిస్తున్నారు. తారాజువ్వలు రాజకీయవేత్త కుమారరత్నం లాగా సూటిగా పైకి పోతున్నాయి. నాయకుని గౌరవార్థం బ్యానర్లు రోడ్లపైన రెపరెపలాడుతున్నాయి.

ఊసరవెల్లి భౌతికకాయం ఊసరవెల్లి సినిమాహాలు దగ్గరకు వచ్చింది. పెద్దరెడ్డి గారు అక్కడ వచ్చీరాని మాతృభాషలో మాట్లాడుతున్నారు. "ఇది ముప్పది ఏళ్ళనాటి తంతు. ఊసరవెల్లి గారు గ్రామ పంచాయితీ ఎన్నికలలో ప్రథమంగా కరణంగారి మఠాకు చెందినవారు. తర్వాత మునసబు దగ్గర చేరారు. పార్టీ కరణం గారిది. నాలుగు నెలలు గిర్రున తిరుగక మునుపే మునసబుగారి వర్గంలోకి దూకి పార్టీ మార్చారుగాని, కరణం గారిని వదలలేదు. చివరకు ఏమి చేశారోగాని మహానుభావులు ఊసరవెల్లి గారు గ్రామ పంచాయితీ ప్రసిడెంటుగిరి దక్కించుకున్నారు. ప్రజాబంధువు మన ఊసరవెల్లి గారు...." ఇంతలో మేడలు, మిద్దెలపైనుండి లారీపైనున్న ఊసరవెల్లి

భౌతికకాయం మీద పడుతున్న పూలదండ ఒకటి గురితప్పి రెడ్డిగారి కంఠాన్ని అలంకరించింది. హర్షధ్వానాల మధ్య ఆకస్మికంగా అనర్గళమైన ఉపన్యాసానికి ఫుల్‌స్టాపు పెటక తప్పలేదు రెడ్డిగారికి.

స్కూలు పిల్లలు బడులకు స్వస్తి పలికారు. కాలేజీ స్టూడెంట్లు కాలేజీలకు బంద్ అన్నారు. విద్యార్థులు రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ బజారున షాపులు బలవంతాన మూయించారు. సినిమాలు ఆడటానికి వీలులేదని ఆంక్షలు విధించారు. సిటీ బస్సులు. రిక్షాలు, లారీలు వీధులలో తిరుగరాదని నిషేధాజ్ఞలు జారీ చేశారు. జట్లు, జట్లుగా వచ్చి నాయకుని అంతిమ యాత్రలో పాలు పంచుకున్నారు.

కాలేజీ యూనియన్ నాయకుడు, ఊసరవెల్లి గారికి "ఊసరవెల్లి ఫ్లోర్ మిల్సు" సెంటరులో ఘుమఘుమ లాడు గులాబి దండలు వేసి "ఊసరవెల్లి గారికి ఓన మాలు రాకపోయినా, చదువుకున్న వారంటే అమితమైన ప్రేమ. సిటీ సెంట్రలు స్కూలు ఆయన పెట్టిన భిక్షయే. హాస్టలు వసతివారి కులంవారికే ఉన్నా మిగిలిన అన్ని కులాలకు స్కూల్లో చదివే అవకాశం కల్పించారు." అని సిగరెట్టు దమ్ము గట్టిగా పీల్చాడు.

రోడ్లపైన జనం బారులు తీర్చి నిలబడ్డారు. నెమ్మదిగా నాయకుని అంతిమ యాత్ర ఊసరవెల్లి ఇండస్ట్రియల్ ఎస్టేటు దగ్గరకు వచ్చింది. సాయంత్రం అయిందేమో, జనం కిట కిట లాడుతున్నారు. గంగా భాగీరథీ సమానురాలైన మాజీ మునిసిపలు కౌన్సిలర్ ఆదిలక్ష్మమ్మ గారు కన్నీళ్ళతో ఉపన్యాసం చెపుతున్నారు. "మన ఊసరవెల్లి బంజరు భూములు పేదలకు పంచాడు. తాను కూడా పేదవాడిలాగా బంజరులోనే. భవంతి లేపాడు. అంటే పేదలమధ్య నివసించాడన్నమాట. వారికి చిన్నతనం నుండిగూడ బలహీన వర్గాలమీద అమితమైన ప్రేమ" ఇంక కంఠం పెగలక మౌనం వహించారు.

ఊరేగింపు ఊసరవెల్లి ఎస్టేటు దాటుతోంది. కార్మిక నాయకుడు కోటయ్య ప్రసంగిస్తున్నాడు. "మంత్రులు మన పట్నానికి వచ్చినపుడు ప్రజలను పోగు చేయటంలో మన ఊసరవెల్లిగారు అఖండులు. మంత్రులకు అన్ని కులాల వారి చేత, అన్ని వర్గాల వారిచేత లెక్క తప్పక దండలు వేయించేవారు. మన పట్టణంలో ఇంతవరకూ ఆయన చందాలు ప్రోగు చేయని ఉత్సవమూ లేదు. ఆయన హాజరవని మంత్రుల సన్మాన సభా లేదు. అందుకే మంత్రుల మన్ననలతో M.L.A. అయ్యారు" అని ఫ్యాక్టరీ పొడి దగ్గు ఖంగున దగ్గాడు.

నాయకుని భౌతికకాయం అనుకున్న టైముకు ఆయన పార్టీ ఆఫీసు ముందుకు వచ్చింది. "ఊసరవెల్లి-ద్రబతకాలిమళ్ళి" అన్న నినాదాలు ఆకాశంలో మారుమ్రోగాయి. పట్టణ పార్టీ అధ్యక్షుడు ఖద్దరు టోపీ ఒక చేతితో పట్టుకుని "ఊసరవెల్లిగారు M.L.A పదవిలో ముఖ్యమంత్రికి వంతకొట్టలేదు. పార్టీలోని ప్రత్యర్థులతో చేయి కలిపారు. ఆ తెలివితేటలే ఆయనకు మంత్రి పదవి ప్రసాదించాయి. మన పట్నానికి మంత్రి

పదవి లేనిలోటు తీర్చాయి "అని ఉపన్య సిస్తుండగా ప్రజల తప్పట్లు మిన్ను ముట్టాయి. నాయకుని భౌతిక కాయం ఊకొట్టినట్లు కాస్త కదిలింది. ఊరేగింపు ముందుకు నడిచింది.

భౌతికకాయం పట్నానికి ఉత్తరాన చేరుతోంది. తాను మాట్లాడకపోతే తన రాజకీయ భవిష్యత్తేమిటో అన్నట్లుగా ఒకఖద్దరు బురఖా వద్దన్నా ఉపన్యాసం లంకించుకున్నాడు. మరల శ్రోతలు దొరకటం కష్టం అని ఆ లేత రాజకీయవాది బాగాతెలుసు. అందుకే గంభీరంగా"ప్రభుత్వాలు ఎన్నిసార్లు మారినా, పడిపోయినా, మన ఊసరవెల్లి మంత్రిపదవిలో ప్రథమ స్థానం సంపాదించేవారు. ఆయన ఈ పార్టీలకు అతీతుడు. ఏ రాజకీయపార్టీ దేశాన్ని పాలించినా, ఏ రాజకీయ నాయకుడు అగ్రాధిపత్యం వహించినా, ఊసరవెల్లి రాజకీయానికి భయంలేదు. ఆయన పదవికి ఎవరూ ఎసరుపెట్టలేదు. ఊసరవెల్లి లోగుట్టు ఇతరులకు కనికట్టు. శత్రువులకు ఆటకట్టు. ఆయన రాజకీయపు నడత వినూత్నమైన నడక. పూర్వపు స్వాతంత్ర్య సమరంలో దేశభక్తులకు తెలియని నడక. ఆ నడకవాలు బ్రహ్మ చేతివ్రాలు.దాన్నెవరూ పసికట్టలేమ.ఇతర దేశస్థులు సైతం వహ్వా అనేవారు. మొన్న చూడండి, కేంద్ర ప్రభుత్వం పూర్తిగా పడిపోయింది. అయితేనేం, ఆ పార్టీకి కాకపోయినా అమాంతం రాష్ట్రం నుండి కేంద్రానికి ఎదిగాడు. వారి ప్రతిభకు మనం గర్వపడాలి. వారి తర్వాత ఇంత అభ్యుదయ భావాలుగల నాయకుడు పుట్టడం కష్టం. ఆయన చూపిన బాటలో యువజనులు నడుంబిగించి నడవాలి. దేశాన్ని సుసంపన్నం చేయాలి" తప్పట్లు. కేకలు. ఈలలు. ఏకవచన ప్రయోగాలు మిన్నుముట్టాయి.

ఊసరవెల్లి భౌతిక కాయానికి అంత్యక్రియలు జరిగాయి. అన్ని పార్టీల నినాదాలతో ఫిరంగులు మారుమ్రోగాయి. వివిధ రకాలతో ఊసరవెల్లి అంతిమ యాత్ర ముగిసింది. ఊసరవెల్లి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిముషాల మౌనం వహించారు. రెండు చేతులు పైకెత్తి ఆ జనసమూహం తమ ప్రియతమనాయకునికి నమస్కారా లర్పించారు.

జయజయ ధ్వనులు మిన్నుముట్టాయి. సూర్యుడు రాజకీయవేత్తలాగ ముఖం చాటుచేసుకుని మబ్బుల్లోకి పోయాడు.

• • •

ఛోటా నాయకులు ఊసరవెల్లి భార్యను ఓదార్చటానికి ఆయన ఏడంతస్తుల భవంతికి వెళ్ళారు. ఆమె ఇంట్లోలేదు. అప్పటికే ఆవిడకు రాజకీయ నాయకులనుండి రాజధానికి హుటాహుటిని రమ్మని ఆహ్వానం వచ్చింది. ఆవిడ వెంటనే రాజధానికి వెళ్ళింది. ఏ పదవి ఆవిడను వలచిందో, మరి ఊసరవెల్లి రాజకీయం ఊరికే పోతుందా?

మరునాటి దినపత్రికలు "ధృవతార రాలిపోయింది" అని ప్రకటించి, ఊసరవెల్లి అంత్యక్రియలు వైభవంగా జరిగినట్లు వర్ణించాయి. అదే దినపత్రికలో ఊసరవెల్లి దేశానికి చేసిన సేవకు స్మృతి చిహ్నంగా వారి భార్య త్వరలో మంత్రి పదవి చేపట్టనున్నట్లుగా కూడా ప్రకటించారు.